www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 10 | వెల రూ.5.00
Published from: Hyderabad, Karimnagar, Circulated to : Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 91 | మంగళవారం | 10 మార్చి, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681



## ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ

సోషల్ మీడియాలో నిపుణుల కమిటీ ప్రకటన
ఇస్లామిక్ రిపబ్లిక్ మూడో సుప్రీం లీడర్ ఈయన
4

## మొజ్తబా లైట్‌వెయిట్

సుప్రీం ఎంపికలో అమెరికా పాత్ర ఉండాలి..
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
4

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను 'లైట్‌వెయిట్' అని పేర్కొన్నారు. ఇరాన్‌కు శాంతి, సామరస్యాన్ని తీసుకువచ్చే నాయకుడు కావాలని ట్రంప్ అన్నారు.





## ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోండి

- సీఎంకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

2



## ఒలింపిక్స్ లక్ష్యంగా 'స్పోర్ట్స్ వర్సిటీ'

తెలంగాణ వేదికగా అంతర్జాతీయ క్రీడల నిర్వహణే ధ్యేయం

### స్టేడియాల ఆధునీకరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం క్రీడాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' డిజైన్లను పరిశీలించిన ఆయన, క్రీడాకారుల శిక్షణ మరియు మౌలిక సదుపాయాల కల్పనపై కీలక దిశానిర్దేశం చేశారు.
మిగతా 2 లో



## గల్ఫ్‌లోని భారతీయుల భద్రతకు ప్రాధాన్యం

4

- వార్ జోన్ నుంచి 67వేల మందిని తరలించాం
- ప్రస్తుతం రోజూ 50 విమానాలు నడుపుతున్నం
- ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం
- యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలి.. దౌత్యంతోనే పరిష్కారం
- ఇంధన భద్రతపై కేంద్రం అప్రమత్తం
- ఉభయ సభల్లో విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్



## లిక్కర్ కన్నా సారాయే బెటర్

- గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి
- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

2

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సీఎం



## లోక్‌సభలో గందరగోళం

4

- చైర్మన్ నిరాకరణతో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు
- సభ నేటికి వాయిదా





2

## వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

- ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

## లిక్కర్ స్కామ్ కేసులో మరో ట్విస్ట్




- కవిత సహా 23 మందికి నోటీసులు!
- సీబీఐ తరఫున ఏఎస్జీ తుషార్ వాదనలు
- ప్రతివాదుల తరఫున హాజరు కాని లాయర్లు
- కౌంటర్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం

వివరాలు 2వ పేజీలో

## గణపతి ఎక్కడ?

- నేపాల్‌పై నిఘా వర్గాల దృష్టి
- మావోయిస్టు మాజీ అగ్రనేత కోసం పోలీసుల ముమ్మర వేట
- లొంగిపోతే మెరుగైన వైద్యం, పునరావాసం కల్పిస్తామన్న ప్రభుత్వం

2





2

## విద్యుదాఘాతం

### ఇద్దరు యువకుల దుర్మరణం

- ఒకరు సజీవ దహనం.. మరొకరు అక్కడికక్కడే మృతి
- ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ప్రమాదం

## చావుకు భయపడి లొంగిపోలేదు

- చట్టం పరిధిలోనే ప్రజా సమస్యలపై పోరాటం
- మాజీ మావోయిస్టు నేత ఆశన్న

2





# విద్యుదాఘాతం

## ఇద్దరు యువకుల దుర్మరణం

**ఒకరు సజీవ దహనం.. మరొకరు అక్కడికక్కడే మృతి**

**పెట్రోల్ బంక్ వద్ద ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ప్రమాదం**

**ప్రజానావ, దండేపల్లి:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేటలో సోమవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ మెయిన్ లైన్ తగిలి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కళ్లెదుటే జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాదరిపేటలోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఒక భారీ ఇనుప స్టాండ్‌ను కదుపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ స్టాండ్‌ను రోడ్డుపై నుంచి జరుపుతున్న క్రమంలో, అది పైన తక్కువ ఎత్తులో వేలాడుతున్న హై ఓల్టేజ్ విద్యుత్ మెయిన్ లైన్‌కు తగిలింది. దీంతో ఒక్కసారిగా ఆ ఇనుప స్టాండ్‌లోకి భారీగా విద్యుత్ ప్రవహించింది. విద్యుత్ ధాటికి స్టాండ్‌ను పట్టుకున్న మ్యాదరిపేట గ్రామానికి చెందిన సల్ల లక్ష్మీనారాయణ (ఎడ్డన్న), వెల్గనూర్ గ్రామానికి చెందిన చందనగిరి నాగరాజులకు తీవ్రగా షాక్ తగిలింది. విద్యుత్ ప్రవాహ తీవ్రతకు లక్ష్మీనారాయణ ఒళ్లు మంటలకు ఆహుతై సజీవ దహనం కాగా, నాగరాజు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. చేతికొచ్చిన యువకులు కరెంట్ కాటుకు బలవడంతో మ్యాదరిపేట, వెల్గనూర్ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ అధికారుల అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోండి

**సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ**



**న్యూఢిల్లీ:** సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుపై కీలక సూచనలు చేశారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా ఎన్టీపీ సీ రామగుండంలో ఏర్పాటు చేయసున్న 3x800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని సూచించారు. పూర్తి 5x800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. మొదటి ఫేజ్‌లో లాగే సెకండ్ ఫేజ్‌లోనూ ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85% రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేయనుందని తెలిపారు. రానున్న రోజుల్లో పవర్ డిమాండ్ మరింతగా పెరగనున్న ఈ నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఎన్టీపీసీకి దేశంలోనే విశేషమైన అనుభవం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# గణపతి ఎక్కడ?

**ప్రజానావ, హైదరాబాద్:** దేశంలో మావోయిస్టు ఉద్యమానికి సుదీర్ఘకాలం పాటు నేతృత్వం వహించిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఆచూకీపై నిఘా వర్గాలు మళ్లీ దృష్టి సారించాయి. గత నాలుగున్నర దశాబ్దాల పాటు పార్టీ కార్యదర్శిగా పనిచేసి, 2018లో వృద్ధాప్యం మరియు అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి వైదొలిగిన గణపతి, ప్రస్తుతం నేపాల్‌లో తలదాచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల లొంగిపోయిన కొందరు కీలక నేతలు ఇచ్చిన సమాచారం మేరకు తెలంగాణ పోలీసులు నేపాల్ సరిహద్దుల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. గణపతి లొంగిపోవాలని గతంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన గనుక జనజీవన స్రవంతిలోకి వస్తే ప్రభుత్వం తరఫున భారీ పునరావాస ప్యాకేజీతో పాటు, వయస్సు రీత్యా ఆయనకు అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు మరియు ఆరోగ్య భద్రత కల్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే భరోసా ఇచ్చింది. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న గణపతి ఆరోగ్యం క్షీణించిందని సమాచారం అందుతుండటంతో, పోలీసులు ఆయన కుటుంబ సభ్యుల ద్వారా లేదా ఇతర మాజీ సభ్యుల ద్వారా లొంగిబాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఉద్యమంలో అత్యంత ప్రభావవంతమైన నేతగా ఉన్న గణపతి పట్టుబడితే లేదా లొంగిపోతే అది ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# లిక్కర్ కన్నా సారాయే బెటర్

**గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి**

**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**ప్రజానావ, హైదరాబాద్:** జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బాంబు పేలుస్తానని అన్నారు. సచివాలయం ఎదుట మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సారా దుకాణాలు ఓపెన్ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరుతానని అన్నారు. గతంలో సారా తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. సారా తాగి 115 సంవత్సరాల పాటు బ్రతికిన జనం, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతు న్నారని పేర్కొన్నారు. సైంటిఫిక్ గా సారా ఆరోగ్యానికి హానికరం కాదని, ఇటీవల కొన్ని రాష్టాలు సారా దుకాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలలో ప్రభుత్వాలు అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నారని వివరించారు. వచ్చే బ్జడెట్ అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని స్పష్టం చేశారు.

# ప్రజాసేవలో పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్‌లో సీఎం



**ప్రజానావ, హైదరాబాద్:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం మారుతోందని, దానికి తగ్గట్టుగా పోలీస్ వ్యవస్థ తన పనితీరును మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలను అభినందిస్తూనే, భవిష్యత్తు సవాళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక ప్రధాన సమస్యగా ఉండేదని, దానిని ఎదుర్కోవడానికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నామని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం ఫిజికల్ క్రైమ్ కంటే సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, మన సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోకపోతే ఈ నేరాలను అదుపు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవడంతో పాటు ఉన్న సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. పోలీస్ శాఖలో ఇతర శాఖల్లా 'ఆటో మోడ్' లేదా 'ఆటో ప్రమోషన్' ఉండకూడదని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్ ద్వారా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా పరిగణించి పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరులో ట్రాఫిక్, ముంబైలో వరదలు వంటి సమస్యల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాలని అధికారులకు సూచించారు. రిట్రీట్ కార్యక్రమంలో అధికారులు అందించిన సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్‌మెంట్ వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కమిటీ అధికారుల ప్రతిపాదనలను విశ్లేషించి, చట్టం రూపంలో ప్రభుత్వానికి నివేదిస్తుందని తెలిపారు. పోలీస్ శాఖలో జనాభా ప్రాతిపదికన సిబ్బంది రేషనలైజేషన్ జరగాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని ఆదేశించారు. ప్రతి ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, దీనివల్ల బడ్జెట్ ప్రవేశపెట్టకముందే పోలీస్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించడానికి వీలవుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా 'స్పోర్ట్స్ వర్సిటీ'

మొదటి పేజీ తరువాయి

గచ్చిబౌలి స్టేడియం ఆవరణలో నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఇండోర్ స్టేడియం, వర్సిటీ కాంప్లెక్స్, అత్యాధునిక హాస్టల్ భవనాలతో పాటు అన్ని రకాల క్రీడలకు అవసరమైన మైదానాలను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. "ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా శిక్షణ ఉండాలి. దానికి అవసరమైన ప్రతి సౌకర్యం ఈ యూనివర్సిటీలో ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. వర్సిటీ నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించి, అధికారులకు అవసరమైన మార్పులను సూచించారు. నగరంలోని కీలక క్రీడా ప్రాంగణాలకు పూర్వవైభవం తీసుకురావాలని ఆదేశించారు. గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంతో పాటు కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియాలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించాలని చెప్పారు. క్రీడాకారుల శిక్షణకు, అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్టేడియాలను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్ మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరై క్రీడా రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వేదికలపై భారత పతాకాన్ని రెపరెపలాడించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని సీఎం ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్

**కవిత సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!**

- సీబీఐ తరఫున ఏఎస్జీ తుషార్ మెహతా వాదనలు
- ప్రతివాదుల తరఫున హాజరు కాని లాయర్లు
- కౌంటర్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం




**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమెతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా మొత్తం 23 మంది ప్రతివాదులకు కూడా నోటీసులు ఇచ్చింది. సీబీఐ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. ఇటీవల రౌస్ ఎవెన్యూ కోర్టు ఈ కేసులో కీలక తీర్పు ఇచ్చింది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ నేత కే కవిత సహా 23 మందికి స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఈ తీర్పుతో కేసులో ఉన్న ఆరోపణలు నిలబడవని ట్రయల్ కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సీబీఐ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. సోమవారం జరిగిన విచారణలో సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. లిక్కర్ పాలసీ కేసులో కీలక పాత్రలు ఉన్న వ్యక్తులపై స్పెషల్ కోర్టు సరైన విధంగా పరిశీలన చేయలేదని ఆయన కోర్టుకు తెలిపారు. ముఖ్యంగా కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రలను అంచనా వేయడంలో ట్రయల్ కోర్టు పొరపాట్లు చేసిందని పేర్కొన్నారు. మద్యం పాలసీ వెనుక పెద్ద కుట్ర ఉందని సీబీఐ వాదించింది. కానీ ట్రయల్ కోర్టు మొత్తం వ్యవహారాన్ని విడివిడిగా చూసి నిర్ణయం తీసుకోవడం వల్ల కేసు బలహీనపడిందని అభిప్రాయం వ్యక్తం చేసింది. అందువల్ల ట్రయల్ కోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోర్టును కోరింది. ఈ వాదనలను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ట్రయల్ కోర్టు సీబీఐపై చేసిన వ్యాఖ్యలపై స్టే విధించింది. అలాగే ఈ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఈడీ కేసులో ట్రయల్‌ను కూడా వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు ఆదేశించింది. ఈ సందర్భంగా కవిత అంశం మరోసారి చర్చకు వచ్చింది. లిక్కర్ పాలసీ వ్యవహారంలో ఆమె పాత్రపై సీబీఐ ప్రత్యేకంగా విచారణ జరిపిందని కోర్టులో ప్రస్తావించింది. ట్రయల్ కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు హైకోర్టు విచారణపై అందరి దృష్టి పడింది. ఇక కవిత సహా 23 మంది ప్రతివాదులు సీబీఐ పిటిషన్‌కు తమ సమాధానాలు దాఖలు చేయాల్సి ఉంది. ఈ కేసులో తదుపరి పరిణామాలు మార్చి 16న జరిగే విచారణలో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# చావుకు భయపడి లొంగిపోలేదు

- చట్టం పరిధిలోనే ప్రజా సమస్యలపై పోరాటం
- కొత్తదారి వెతుకులాటలో ఉన్నాం'
- మాజీ మావోయిస్టు నేత ఆశన్న
- బట్టుపల్లిలో అమరుల కుటుంబాలతో భేటీ



**ప్రజానావ, హన్మకొండ:** "మేము మరణానికి భయపడే వ్యక్తులం కాదు. చావుకు భయపడి లొంగిపోయామని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు. సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా, చట్టం పరిధిలో ఉండి పనిచేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కలపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న స్పష్టం చేశారు. సోమవారం హన్మకొండ జిల్లా ఖాజీపేట మండలం బట్టుపల్లి గ్రామంలో మాజీ మావోయిస్టులు, అమరుల కుటుంబాలను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాల పాటు దండకారణ్యంలో ఆదివాసీల హక్కుల కోసం, నిర్బంధాల మధ్య పనిచేశామని గుర్తు చేసుకున్నారు. "ప్రస్తుతం సమాజంలో పరిస్థితులు మారాయి. ఆ మార్పులకు అనుగుణంగానే పోరాడాలని కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో చర్చించిన తర్వాతే బయటకు వచ్చే నిర్ణయం తీసుకున్నాం. అన్నీ ఆలోచించే ఈ అడుగు వేశాం" అని వివరించారు. లొంగుబాటుపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు.

**కొత్త దారి వెతుకులాటలో..**

ప్రస్తుతానికి తాము ఏ రాజకీయ పార్టీలో చేరాలనే ఆలోచనలో లేమని ఆశన్న స్పష్టం చేశారు. "సమాజంలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం ఒక వర్గానికో, కులానికో పరిమితం కాకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తాం. పదేళ్ల క్రితం పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలతో చర్చలు జరిపి ఉంటే ఇంతమంది అమరులయ్యేవారు కాదు. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో కొత్త దారి వెతుకులాటలో ఉన్నాం" అని పేర్కొన్నారు. తాము ఎక్కడికీ పారిపోమని, ప్రజల మధ్యే ఉండి పనిచేస్తామని భరోసా ఇచ్చారు. తన విప్లవ ప్రయాణం బట్టుపల్లి నుంచే మొదలైందని, ఈ గ్రామంతో తనకు విడదీయని అనుబంధం ఉందని ఆశన్న భావోద్వేగానికి లోనయ్యారు. తన ప్రయాణంలో అండగా నిలిచిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఆశన్న వెంట పవనానందరెడ్డి (శ్యామ్ దాదా), యాదగిరి (రాజ్మన్), పద్మ, వనిత తదితరులు ఉన్నారు. కాగా, మాజీ మావోయిస్టు నేతలు బట్టుపల్లి గ్రామంలో అమరుల కుటుంబాలను కలవడంపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఉన్నతాధికారులు స్వయంగా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించడం చర్చనీయాంశంగా మారింది.



# తిరుపతి జిల్లాలో విషాద ఘటన

## కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి

**ప్రజానావ, తిరుపతి:** జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఆర్థిక సంక్షోభంతో తగ్గుతున్న పసిడిధరలు

## బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల



**న్యూఢిల్లీ:** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.


# లెబనాన్‌లో ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్

## దక్షిణ లెబనాన్లోని యోహ్మోర్‌లో ఘటన

## కనీసం రెండు ఇళ్లల్లో అగ్ని ప్రమాదాలు

## హ్యూమన్ రైట్స్ వాచ్ సీరియస్

**టెహ్రాన్:** దక్షిణ లెబనాన్‌లోని నివాస ప్రాంతాలపై ఇజ్రాయెల్ తెల్ల ఫాస్ఫరస్ ఆయుధాలను వినియోగించినట్లు మానవ హక్కుల సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ ఆరోపించింది. ఈ నెల 3న లెబనాన్ లోని యోహ్మోర్ ప్రాంతంపై తెల్ల ఫాస్ఫరస్ గోలాలు ప్రయోగించినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన ఏడు ఫొటోల నిజానిజాలను తమ పరిశోధ నలో ధ్రువీకరించినట్లు వెల్లడించింది. ఆ చిత్రా ల్లోనివాస ప్రాంతం మీద తెల్ల ఫాస్ఫరస్ గోలాలు పడటం, కనీసం రెండు ఇళ్లలో మంటలు చెలరే గిన దృశ్యాలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ విషయంపై హ్యూమన్ రైట్స్ వాచ్కు చెందిన లెబనాన్ పరిశోధకుడు రామ్ కైస్ స్పందిస్తూ, నివాస ప్రాంతాలపై ఇలాంటి ఆయుధాలను వినియోగించడం అత్యంత ఆందోళనకరమ ని అన్నారు. తెల్ల ఫాస్ఫరస్ వల్ల కలిగే అగ్ని ప్రభావం తీవ్రమైన గాయాలు, మరణాలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ రసాయన ఆయుధం కారణంగా బాధితులు జీవితాంతం తీవ్ర నొప్పి, బాధలు అనుభవించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.



# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

## ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు



**ప్రజానావ, హైదాబాద్:** తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో-4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో-1 ఫెనైల్-1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷-దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ జడ్జికి 1.66 కోట్ల మోసం

- మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా కేసుల పేరుతో టార్గెట్
- వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారులమని బెదిరింపులు
- ఇంటి నుంచి బయటకు రావొద్దంటూ 'డిజిటల్ అరెస్ట్'
- ప్రతిష్ట దెబ్బతింటుందని భయపెట్టి మనీ ట్రాన్స్ ఫర్
- నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**ప్రజానావ, హైదాబాద్:** రిటైర్డ్ జడ్జిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భారీ మోసానికి పాల్పడ్డారు. మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా కేసుల్లో మీపై కేసులు ఉన్నాయని చెప్పి బెదిరించి మొత్తం రూ.1.66 కోట్లు దోచుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసు కథనం ప్రకారం.. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి తాము సీబీఐ అధికారు లు అంటూ బాధితుడిని భయపెట్టారు. మీ ఆధారు అనుసంధానమైన రెండు మె-ుబైల్ నంబర్ల నుంచి మహిళలకు అభ్యంతరకర కాల్స్ వెళ్తున్నాయని, ఈ వ్యవహారంపై బెంగళూరులోని ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. అదేసమయంలో మానవ అక్రమ రవాణా కేసులో సుప్రీంకోర్టు నాన్బెయిలబుల్ వారెంట్ జారీ అయిందని కూడా నమ్మబలికారు. ఈ కేసు విచారణ జరుగుతున్నందున ఇంటి నుంచి బయటకు రావొద్దని, ఎవరికీ చెప్పొద్దని 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఆంక్షలు విధించారు. బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వాలని ఒత్తిడి చేసి, విచారణ పూర్తయిన తర్వాత డబ్బు తిరిగి ఇస్తామని నమ్మిం చారు. అరెస్టు అయితే ప్రతిష్ట దెబ్బతింటుం దనే భయంతో రిటైర్డ్ జడ్జి మొత్తం రూ.1.66 కోట్లు వారి ఖాతాలకు బదిలీ చేశారు. తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయి నట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్ర యించారు. దీనిపై నేరేడు మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# లోక్‌సభలో గందరగోళం

## దక్షిణాసియా యుద్ధంపై చర్చకు విపక్షాల పట్టు

## చైర్మన్ నిరాకరణతో వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు

## సభ నేటికి వాయిదా



**న్యూఢిల్లీ:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్ దేశంపై దాడి చేయడంతో మిడిల్ ఈస్ట్ కంట్రీస్‌లో ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. ముఖ్యంగా ఇరాన్ ప్రతికార దాడులను అరబ్ కంట్రీస్ పై చేయడంతో ప్రపంచ వ్యాప్త వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ యుద్ధం ప్రభావం ప్రస్తుతం భారత బడ్జెట్ సమావేశాలపై కూడా పడింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఆ పరిస్థితులపై లోక్ సభలో తక్షణ చర్చ చేపట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించి, సరిహద్దుల్లో మారుతున్న పరిణామాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, చైర్మన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం మొదలైంది. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేతలు నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. వారితో చైర్మన్ వారించినప్పటికీ విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులతో నిరసన తెలిపారు. యుద్ధం వంటి సున్నితమైన అంశంపై చర్చకు వెనుకాడటం సరికాదని, దేశ భద్రత దృష్ట్యా దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సభ్యుల నినాదాలు, తోపులాటల మధ్య సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సభను సజావుగా నడిపించడం సాధ్యం కాదని భావించిన చైర్మన్ లోక్‌సభను నేటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# గవర్నర్‌కు ఘన వీడ్కోలు

## బేగంపేట విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందజేసిన ఉన్నతాధికారులు





**ప్రజానావ, హైదాబాద్:** తెలంగాణ గవర్నర్‌గా సేవలందించి, బదిలీపై మహారాష్ట్ర గవర్నర్‌గా వెళ్తున్న జిష్ణు దేవ్ వర్మకు సోమవారం బేగంపేట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. మహారాష్ట్రలో నూతన బాధ్యతలు చేపట్టేందుకు ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడి నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ తదితరులు బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, వారిని సాదరంగా కలిశారు. తెలంగాణలో వారి పదవీకాలం విజయవంతంగా సాగినందుకు అభినందనలు తెలుపుతూ వీడ్కోలు పలికారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తన పర్యటన ముగించుకుని ప్రత్యేక విమానంలో ముంబైకి బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన మహారాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.




సంపాదకీయం

# ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు

## ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం!

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది. చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా- ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషంగానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లు కుదేల్

# 12 లక్షల కోట్లు ఆవిరి

- ప్రారంభంలోనే 2000 పాయింట్లకు సెన్సెక్స్ డౌన్
- కీలకమైన 24 వేల మార్క్ కిందకు జారిన నిఫ్టీ
- బ్యాంకింగ్, పీఎస్ఈ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో భారీ అమ్మకాలు
- బ్యారెల్‌కు 114 డాలర్లకు చేరిన ముడి చమురు ధరలు
- డాలర్ ఎదుట బలహీనపడిన రూపాయి



**ముంబై:** పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ పతనాన్ని నమోదు చేశాయి. వారం ప్రారంభంలోనే బెంచ్మార్క్ సూచీలు తీవ్రంగా క్షీణించాయి. ప్రారంభట్రే డింగ్లో సెన్సెక్స్ 2000 పాయింట్లకు పైగా పడిపోగా, నిఫ్టీ కీలకమైన 24 వేల స్థాయి కిందకు జారింది. మార్కెట్ల పతనంతో పెట్టుబడిదారుల సంపదలో ఒకే రోజులో సుమారు రూ.12 లక్షల కోట్లు ఆవిరైంది. రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్, పీఎస్యూ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో అత్యధిక అమ్మకాలు నమోదయ్యా యి. నిఫ్టీ పీఎస్యూ బ్యాంక్ సూచీ ప్రారంభంలోనే 4శాతం కంటే ఎక్కువ నష్టపోయి వెనుకబడిన రంగంగా నిలిచింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు కూడా బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. విస్తృత మార్కెట్లలోనూ ఇదే ధోరణి కని పించింది. నిఫ్టీ మిడ్క్యాప్, నిఫ్టీ స్మాల్క్యాప్ సూచీలు రెండూ సుమారు 2.5శాతం కంటే ఎక్కువ పడిపోయాయి. భారత మార్కెట్ ధోరణికి ముందస్తు సూచికగా భావించే గిఫ్ట్ నిఫ్టీ కూడా రెండు శాతం కంటే ఎక్కువ క్షీణించి 23,700 స్థాయికి సమీపంలో ట్రేడ్ అయింది. ఇదే సమయంలో పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్కు 114 డాలర్లకు పైగా పెరగడం మార్కెట్లపై ఒత్తిడిని మరింత పెంచింది. చమురు ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. మరోవైపు డాలర్ బలపడటంతో రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్ ఎదుట రూపాయి విలువ 0.6శాతం క్షీణించి రూ.92.33 స్థాయికి చేరింది. విదేశీ పెట్టుబడిదారులు జాగ్రత్త ధోరణి అవలంబించడంతో మార్కెట్లలో అమ్మకాలు పెరిగాయి. ఆసియా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కనిపిం చింది. జపాన్ నిక్కీ సూచీ, దక్షిణ కొరియా కోస్పి సూచీలు భారీగా పడిపోగా ఆస్ట్రేలియా మార్కెట్లు కూడా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. మొత్తంగా పశ్చిమాసియా ఉద్రిక్తతలు గ్లోబల్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. భారత మార్కెట్లపై కూడా దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

# గల్ఫ్ లోని కోటి మంది భారతీయుల భద్రతకు ప్రాధాన్యం

- వార్ జోన్ నుంచి 67వేల మందిని తరలించాం
- ప్రస్తుతం రోజూ 50 విమానాలు నడుపుతున్నాం
- భారతీయులు ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం
- యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలి.. దౌత్యంతోనే పరిష్కారం
- ఇంధన భద్రతపై కేంద్రం అప్రమత్తం
- ఉభయ సభల్లో విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్



**న్యూఢిల్లీ:** గల్ఫ్ దేశాల్లో ఉన్నకోటి మంది భారతీయుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని దేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చెప్పారు. సోమవారం పార్లమెంటు ఉభయ సభల్లో ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఉద్రిక్తతలు తగ్గించి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం కావాలని ఆకాం క్షించారు. పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిణామాలను సమీపంగా గమనిస్తున్నారని తెలిపారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూ రిటీ సమావేశంలోనూ అక్కడ ఉన్న భార తీయుల భద్రతపై చర్చించినట్లు వెల్లడిం చారు. పశ్చిమాసియా ప్రాంతం భారత్కు ఇంధన భద్రత, వాణిజ్య పరంగా కీలకమని జైశంకర్ చెప్పారు. గల్ఫ్ దేశాలతో భారత్కు ఏటా దాదాపు 200 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలు, ఇరాన్లో కలిపి సుమారు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. యుద్ధ పరిస్థితుల్లో అక్కడ చిక్కుకున్న భారతీయులను తిరిగి తీ సుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటివరకు 67 వేల మందిని సురక్షితంగా తరలించినట్లు తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసినట్లు, ప్రస్తుతం రోజుకు దాదాపు 50 విమానాలు నడుస్తున్నట్లు చెప్పారు.

### ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం

ఇరాను వెళ్లవద్దని జనవరిలోనే భారతీయులకు సూచించినట్లు జైశంకర్ గుర్తుచేశారు. ప్రస్తుతం అక్కడ ఉన్న భారతీయుల భద్రతకు భారత రాయబార కార్యాలయం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పరిస్థితులు చక్కబడిన వెంటనే టెహ్రాన్లోని భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ సరఫరా చైన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, పెట్రోలు, గ్యాస్ సరఫరాలపై ప్రభుత్వం నిశితంగా నిఘా పెట్టిందన్నారు. ఇంధన భద్రతకు, భారత కంపెనీల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. శాంతి స్థాపన కోసం భారత్ తన వంతు దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తోందని, అంతర్జాతీయ మానవతా చట్టాలను ప్రతి దేశం గౌరవించాలని జైశంకర్ పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో మానవతా సహాయం కూడా అందిస్తున్నామని, ఇటీవల ఇరాన్కు చెందిన ఓ నౌకను డాకింగ్ చేసేందుకు భారత్ సహకరించినట్లు తెలిపారు.

# ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ

## సోషల్ మీడియాలో నిపుణుల కమిటీ ప్రకటన

### ఇస్లామిక్ రిపబ్లిక్ మూడో సుప్రీం లీడర్



**టెహ్రాన్:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజబా ఖమేనీని ఎంపిక చేశారు. తన తండ్రి అలీ ఖమెనీ మరణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిపుణుల సభప్రకటించింది. 88 మంది మతపెద్దలతో కూడిన నిపుణుల సభ(అసెంబ్లీ ఆఫ్ ఎక్స్పర్ట్స్) ఓటింగ్ ద్వారా ఆయనను ఇస్లామిక్ రిపబ్లిక్ మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నుకుంది. 1979 ఇస్లా మిక్ విప్లవం తర్వాత ఇరాన్లో ఇప్ప టివరకు ముగ్గురు మాత్రమే సుప్రీం లీడర్లు ఉన్నారు. తొలి సుప్రీం లీడర్ ఆయతొల్లా రుహొల్లా ఖొమేనీ కాగా, ఆయన మరణానం తరం 1989లో అలీ ఖమెనీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యారు. 56 ఏళ్ల మొజ్తబా ఖమెనీ ఇరాన్లో మత పెద్దగా గుర్తింపు పొందిన వ్యక్తి. భద్రతా వ్యవస్థలపై, ముఖ్యంగా రివల్యూషనరీ గార్డ్స్ ఆయనకు ప్రభావం ఉందని భావిస్తున్నారు. తండ్రి పాలన సమయంలోనే ప్రభు త్వవ్యవహారాల్లో ఆయన ప్రభావం పెరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్లో సుప్రీం లీడర్ పదవి అత్యంత శక్తివంతమైనది. దేశ రాజ కీయాలు, సైన్యం, న్యాయవ్యవస్థపై తుది నిర్ణయాధికారం ఈ పదవికే ఉంటుంది. దీంతో మొజ్తబా ఖమేనీ ఇప్పుడు దేశంలోని అన్ని కీలక వ్యవ హారాలపై అధికారం పొందారు.

# మొజ్తబా లైట్‌వెయిట్

## సుప్రీం ఎంపికలో అమెరికా పాత్ర ఉండాలి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా నియమితుడైన మొజ్తబా ఖమెనీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను "లైట్‌వెయిట్" అని పేర్కొన్నారు. ఇరాన్‌కు శాంతి, సామరస్యాన్ని తీసుకువ చ్చే నాయకుడు కావాలని ట్రంప్ అన్నారు. గత వారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఇరాన్లో ఏర్పడుతున్న నాయకత్వం దేశానికి స్థిరత్వం తీసుకురాదని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌లో కొత్త సుప్రీం లీడర్ ఎంపిక ప్రక్రియలో అమెరికా కూడా పాత్ర పోషించాల్సి ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. వెనిజువెలాలో జరిగిన రాజకీయ పరిణామాలను ఉదాహర ణగా ప్రస్తావిస్తూ అక్కడలాగే ఇక్కడ కూడా తాను జోక్యం చేసుకోవాల్సి రావచ్చని చెప్పారు. ఇదిలా ఉండగా, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమెనీ మరణానంత రం ఆయన కుమారుడు మొజ్తబా ఖమెనీని దేశ కొత్త సుప్రీం లీడర్ గా ప్రకటించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జా తీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.





# 15న అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ జయంతి బహిరంగ సభ

## అనుమతి ఇచ్చిన డీఎస్పీ బీఎస్పీ

**ప్రజానావ, సిరిసిల్ల :** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అనుమతి మంజూరు లభించిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొమ్మాట అశోక్ వెల్లడించారు. ఈ సందర్భంగా అనుమతి ఇచ్చిన సిరిసిల్ల డిఎస్పి కే నాగేంద్ర చారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు కొమ్మాట అశోక్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా కాన్షీరామ్ చేసిన పోరాటాన్ని, వారి ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేయడానికి సిరిసిల్ల జిల్లా నలుమూలల నుండి బహుజన బిడ్డలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనుగుందుల వెంకన్న, పార్టీ నాయకులు లింగంపల్లి మహేష్, ఎడ్ల అరుణ్, కొమ్మెట వేణు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ప్రజావాణికి 179 దరఖాస్తుల రాక



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 179 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 53, గృహ నిర్మాణ శాఖకు 29, డీఆర్డీఓ- 20, సంక్షేమ శాఖకు-14, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఎండీ సెస్-12, ఉపాధి కల్పన శాఖ, వైద్య శాఖ, ఈఈ పీఆర్‌కు చొప్పున 4, పౌర సరఫరాల శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు 3 చొప్పున, విద్యా శాఖ, ఈఈ ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, మిషన్ భగీరథకు 2 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా ప్రణాళిక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, ఎక్సైజు శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, డీపీఆర్ఓ, పశు సంవర్ధక శాఖ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## "నారీ శక్తి చీర ఆవిష్కరణ"లో కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో వివిధ క్రీడలు, రక్షణ, పలు రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను కీర్తిస్తూ చంద్రంపేటకు చెందిన వెల్ది రేఖ మూడు నెలల పాటు శ్రమించి రూపొందించిన ' నారీ శక్తి ' చీరను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం(టీడీఎఫ్) ఆద్వర్యంలో వనిత చేయూత.. మహిళా సాధికారత కింద ముస్తాబాద్ మండలానికి చెందిన మహిళలకు కుట్టు శిక్షణ అందించి.. వారికి సర్టిఫికెట్లు, కుట్టు మెషిన్లు కలెక్టర్ చేతుల మీదుగా అపెరల్ పార్క్ లో అందజేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కుట్టు శిక్షణ పొందిన మహిళలు నేర్చుకున్న మెళకువలు ఉపాధి పొందడంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, టీడీఎఫ్ అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్ రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముంబైలో అక్రమ బైక్ టాక్సీలపై కఠిన చర్యలు

- ఓలా, ఉబర్, రాపిడోకు మరో నెల గడువు
- 130 వాహనాలు స్వాధీనం... రూ.33 లక్షల జరిమానా



**ప్రజానావ, ముంబై:** ముంబైతో పాటు పరిసర ప్రాంతాల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్న అక్రమ బైక్ టాక్సీలపై మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. నిబంధనలు పాటించని సంస్థలపై కేసులు నమోదు చేసి, వాటి తాత్కాలిక లైసెన్సు లను రద్దు చేసినట్లు రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ శాసన మండలిలో ప్రకటించారు. ఈ నిర్ణయంతో ప్రయా ణికులు ఇకపై అనధికార బైక్ టాక్సీల సేవలను పొందలేరని తెలిపారు. పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం కేవలం 'ఈ-బైక్' టాక్సీలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. అయితే ఓలా, ఉబర్, రాపిడో వంటి అగ్రిగేటర్ సంస్థలు ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ పెట్రోల్‌తో నడిచే వాహనాలను టాక్సీలుగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించింది. పలుమార్లు హెచ్చరికలు ఇచ్చినా నిబంధనలు పాటించకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థలకు అవసరమైన పత్రాలు సమర్పించేందుకు ఇప్పటికే ఒక నెల గడువు ఇచ్చామని, అయినప్పటికీ అవి స్పందించలేదని చెప్పారు. చివరి అవకాశంగా మరో నెల గడువు ఇస్తున్నామని, ఈలోపు షరతులు నెరవేర్చకపోతే ఆయా కంపెనీల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేస్తామని మంత్రి హెచ్చరించారు.

### తనిఖీలు నిర్వహించాలని ఆదేశం

అక్రమ బైక్ టాక్సీలను నియంత్రించేందుకు ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్‌టీఓ), ఉప ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 2024 నుంచి ఇప్పటివరకు మొత్తం 130 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, రూ.33 లక్షలకు పైగా జరిమానాలు విధించారు. ఇప్పటివరకు బైక్ టాక్సీ నిబంధనలు ఉల్లంఘించినప్పుడు సాధారణంగా వాహనాన్ని సీజ్ చేయడం, డ్రైవర్‌కు జరిమానా విధించడం మాత్రమే జరిగేది. అయితే కొత్త నిర్ణయం ప్రకారం పెట్రోల్ బైక్ టాక్సీ నడుపుతూ పట్టుబడితే డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నారు. సంబంధిత వాహనాన్ని శాశ్వతంగా స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘించే వాహనాల రిజిస్ట్రేషన్ లైసెన్సులను కూడా రద్దు చేసే అవకాశముందని మంత్రి తెలిపారు.

# ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమాల అమలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రతి జిల్లా కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడ, ఆయా ప్రాంతాల్లోని జిల్లా కార్యాలయాలు, మున్సిపల్, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వచ్ఛత.. పరిశుభ్రత పనులు పక్కాగా చేయాలని, ఆయా శాఖల అధికారులు, మండల అధికారులు పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో నిరుపయోగ వస్తువులు, చెత్తాచెదారం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహిళా దినోత్సవం

**ప్రజానావ, జమ్మికుంట :** జమ్మికుంట మండలం శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మడికొండ సురేందర్ రావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి ఝాన్సీ, మహిళ వార్డు సభ్యురాళ్లు, మహిళ సంఘాల సభ్యులు, గ్రామ మహిళలను శాల్వాలతో సర్పంచ్ ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు సాధించిన విజయాలు గుర్తు చేసుకోవడానికి, సమాజంలో సమాన హక్కులు, గౌరవం దక్కాలని పోరాడేందుకు ఈ రోజు గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉదయశ్రీ, వార్డు సభ్యులు మౌనిక, స్వర్ణలత, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డులోకి లెజిమ్-యోగాచాప్ ప్రదర్శన

- 9,111 మంది విద్యార్థినుల సమూహ వ్యాయామం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం



**ప్రజానావ, ముంబై:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని డోంబివళి నగరంలో విద్యార్థినులు అద్భుత ప్రదర్శనతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 9,111 మంది విద్యార్థినులు కలిసి లెజిమ్-యోగా చాప్ వ్యాయామాన్ని సమూహంగా ప్రదర్శించి ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ కార్యక్రమం డోంబివళిలోని సవలారామ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా జరిగింది. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా శక్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం నగరంలో విశేష ఆకర్షణగా నిలిచింది. డోంబివళి నగరం సాంస్కృతిక వారసత్వానికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడి సామాజిక సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు హిందూ సాంప్రదాయ కళలను కాపాడటానికి, యువతలో దేశభక్తిని పెంపొందించడానికి తరచూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని డోంబివ్లికర్ ఏక్ సాంస్కృతిక పరివార్, కళ్యాణ్ తాలూకా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా నిర్వహించాయి.

### కొన్ని రోజులుగా ప్రత్యేక శిక్షణ

మహారాష్ట్ర సాంప్రదాయ కళల్లో లెజిమ్ ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. ఈ వారసత్వాన్ని తదుపరి తరాలకు అందించాలనే ఉద్దేశంతో పాఠశాల ఉపాధ్యాయులు కొన్ని రోజులుగా విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఫలితంగా మహిళా దినోత్సవం సందర్భంగా వేలాది మంది విద్యార్థినులు ఒకేసారి లెజిమ్-యోగాచాప్ వ్యాయామం ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఈ ప్రదర్శనను గిన్నిస్ ప్రతినిధులు ధ్రువీకరించి అధికారిక సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మహారాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర చవాన్, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ దీపేష్ మాత్రే తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రేరణగా నిలిచిన రవీంద్ర చవాన్ విద్యార్థినులను అభినందిస్తూ మహిళా శక్తిని కీర్తించారు.







# వాగేశ్వరి డిగ్రీ కాలేజీ విద్యార్థుల నిజాయితీ

**ప్రజానావ, కరీంనగర్:** నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కాలేజీ ఫైనల్ఇయర్విద్యార్థులకు సోమవారం రోడ్డుపై దొరికిన పర్సును కరీంనగర్టూ టౌన్సీఐ సృజన్రెడ్డికి అందజేసి నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సైబర్క్రైం హెడ్కానిస్టేబుల్రవి డ్యూటీలో భాగంగా కాలేజీలో విద్యార్థులకు సైబర్క్రైంపై అవగాహన కల్పించిన అనంతరం మధ్యాహ్నం వెళ్లిపోయారు. అంతలోనే బయటకు వచ్చిన విద్యార్థులకు రోడ్డుపై ఓ పర్సు కనిపించింది. అందులో పోలీస్ఐడీ కార్డు ఉండటంతో వెంటనే టూటౌన్స్టేషన్కు వెళ్లి, వారికి దొరికి పర్సును సీఐకి అందజేశారు. సీఐ వెంటనే సదరు హెడ్కానిస్టేబుల్ను స్టేషన్ను రప్పించి, పోగొట్టుకున్న పర్సును ఆ విద్యార్థుల సమక్షంలో అందజేశారు. ఆ పర్సులో రూ.2750 నగదు, ఇతర కీలక పత్రాలు ఉన్నాయని హెడ్కానిస్టేబుల్పేర్కొన్నారు. తమకు దొరికిన పర్సును కనీసం చూడకుండా దానిని ఏకంగా దగ్గరలోని పోలీస్స్టేషన్లో అప్పగించడంపై విద్యార్థులను సీఐ సృజన్రెడ్డి అభినందించారు.

# అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

### ముున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

### పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులకు సత్కారం



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి తోడ్పడతామని, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమకు సహాయ సహకారాలు అందించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానాలు జరిపారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ దాట్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్లను పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, జిల్లా పద్మశాలి సంఘం నాయకులు గాజుల బాలయ్య, పద్మశాలి సంఘం ప్రతినిధులు డాక్టర్ గాజుల బాలయ్య, ఎల్లె శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, దొంత ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన లంచగొండి ఎస్ఐలు

### నోటీసు ఇచ్చేందుకు రూ.లక్ష డిమాండ్

### అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు



**ప్రజానావ, హైదరాబాద్:** ఇటీవల కాలంలో తెలంగాణలోని అనేక మంది ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడుతూనే ఉన్నారు. చిన్నా పెద్ద అని తేడా లేకుండా. ఆ శాఖ ఈ శాఖ అని మొహమాటం లేకుండా వివిధ మార్గాల్లో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా హైదరాబాద్లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్స్పెక్టర్లు ఏసీబీ వలకు చిక్కారు. ఎల్బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఆర్మ్డ్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లుగా పనిచేస్తున్న ప్రమోద్ గౌడ్, జాతావత్ బాబు నాయక్ ఒక సైబర్ క్రైమ్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయకుండా ఉండేందుకు, సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్ (పూర్వపు 41-ఏ సీఆర్పీసీ) కింద నోటీసు ఇచ్చేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. సోమవారం ఎల్బీ నగర్ చౌరస్తా వద్ద బాధితుడి నుంచి ఈ లంచం మొత్తాన్ని బాబు నాయక్ స్వీకరిస్తుండగా, ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు వారిని పక్కా ప్రణాళికతో పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి లంచం సొమ్ము రూ. 1 లక్ష స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన ఇద్దరు ఎస్ఐలను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

# పేద ప్రజలపై ధరల భారం మోపడమేనా నరేంద్ర మోడీ విధానం?



- వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి
- పెంచిన వంట గ్యాస్ ధరలపై నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

**ప్రజానావ, సిరిసిల్ల :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ తగ్గించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ గతంలో యూపీఏ ప్రభుత్వం హాయంలో 50 రూపాయలు వంట గ్యాస్ ధర పెంచితే ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ లబోదిబో మని మొత్తుకుంటూ 50 రూపాయలు సిలిండర్ ధర పెంచితే పేద ప్రజలు ఎట్లా బతకాలని ఎన్నికలలో ప్రచారం చేస్తూ ఓటు వేసే ప్రతి ఒక్కరూ సిలిండర్ కు మొక్కి కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఓటు వేయాలని అన్న నరేంద్ర మోడీ ఈరోజు సిలిండర్ ధర వెయ్యి రూపాయల పైచిలుకు పెంచితే ప్రజలపై భారాలు పడవా అని ప్రశ్నించారు. దేశం కోసం ధర్మం కోసం అని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతూ దేశంలో ఉన్న ప్రజల సంపాదన దోచుకొని ఆదాని అంబానీలకు అప్ప గించడమేనా నీ ధర్మం అన్నారు. రోజు కష్టం చేసుకునే వారి వేతనాలు ఒకపక్క పడిపోతుంటే ధరలు మాత్రం విపరీతంగా పెరిగి ఆకాశానికి అంటుకుంటున్నాయనీ, పేద ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెరిగిన ధరల వలన వచ్చే ఆదాయం సరిపోక ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలై కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ, ఇవేమీ పట్టించుకోకుండా కేవలం బడా పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా నిర్ణయాలు చేస్తూ ప్రజా సమస్యలను పక్కదో పట్టించే విధంగా ప్రజల మధ్య చిచ్చులు రేపుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను ఎక్కువ రోజులు మోసం చేయలేరన్నారు. ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలపై భారాలు వేయకుండా ధరలపై నియంత్రణ నుంచి పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, జిల్లా కమిటీ నాయకులు శ్రీరాముల రమేష్ చంద్ర, సిపిఎం జిల్లా నాయకులు మిట్టపల్లి రాజమల్లు, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్లె సత్యం, రవి, బెజగం సురేష్. ఆడెపు రజిత, కుమ్మరి కుంట కిషన్, జిందం కమలాకర్, కోలా శ్రీనివాస్, స్వర్గం శేఖర్, శ్రీరాముల కవిత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతుల సొమ్ముతో రాష్ట్రంలో రాహుల్ బంధు పథకం

- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతుబంధు నిధులను ఈ రాహుల్ బంధు పథకానికి పంపిస్తున్నారు
- అందుకే నాలుగు సార్లు రైతుబంధును ఎగగోట్టారు
- రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీటును కాపాడుకుంటున్నాడు
- ఆరు గ్యారంటీలగా అమలుకు చట్టబద్ధత కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతాం



**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కొత్త పథకాన్ని, 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. శనివారం సిరిసిల్ల మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు సిరిసిల్ల తెలంగాణ భవన్ లో జరిగిన ఆత్మీయ సత్కారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీ రామారావు మాట్లాడుతూ ఈ రాహుల్ బంధు పథకాన్ని రైతులకు ఇచ్చే రైతు బంధు నిధులతో మొదలుపెట్టాడని, సంవత్సరానికి 1000 కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా వేల కోట్ల రూపాయలు పంపించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని, అందుకే రాహుల్ గాంధీ కోసం బ్రహ్మాండమైన ఈ కొత్త పథకాన్ని తెలంగాణలో తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ విమర్శలు చేశారు. రాష్ట్రంలోని రైతన్నలంతా తమకు రైతు బంధు వస్తుందని, కాంగ్రెస్ పార్టీ పెంచి ఇస్తామన్న నిధులను ఇస్తుందని ఎదురు చూస్తూ ఉంటే.... రేవంత్ రెడ్డి రైతు బంధును ఎగగొడుతున్నాడని కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికే మూడుసార్లు రైతు బంధును ఎగగొట్టిన రేవంత్ రెడ్డి, ఈసారి కూడా రైతు బంధును ఎగగొట్టాడని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీటును కాపాడుకుంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి తన సీఎం పీఠం కాపాడుకోవడానికి ఎప్పటికప్పుడు రాహుల్ గాంధీకి ఆయన కుటుంబానికి అడ్డగోలుగా డబ్బులు పంపుతున్నారని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి సామంతు రాజు లెక్క రాహుల్ గాంధీ ఢిల్లీ గద్దెకు కప్పం కడుతూ ఉన్నారని, అందుకే రాహుల్ కి చెల్లించాల్సిన కప్పం గురించి పేదల భూములు గుంజుకొని, పేదల ఇల్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇళ్లను కూలగొట్టి మరి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి ప్రతి ఒక్కరూ తెలంగాణకు వచ్చి 100 రోజుల్లోనే తాము ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను మొదటి క్యాబినెట్ లో నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పించి... అమలు చేస్తామని రాహుల్ గాంధీతో సహా అందరూ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ తెలంగాణ ప్రజలకు బాకీ పడిన ఆరు గ్యారంటీల చట్టంను ఈ సమావేశాల్లో ప్రస్తావిస్తామన్నారు. అందుకే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి, బిల్లు పెట్టి ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు హామీలు అమలు చేసేలా ప్రయత్నం చేస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని, ఎందుకంటే తమ సొంత నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన మాటనే తాము అసెంబ్లీలో చెప్తామన్నారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి రాహుల్ గాంధీతో సహా తమ పార్టీ నేతలు అంతా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, తుల ఉమ, చీటీ నర్సింగరావు, కుంభాల మల్లారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఇఫ్తార్ విందులో పాల్గొన్న కేటీఆర్

**ప్రజానావ, సిరిసిల్ల :** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇఫ్తార్ విందు కార్యక్రమం స్థానిక షాదీఖానా ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఇఫ్తార్ విందు సందర్భంగా కేటీఆర్ ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మజీద్ కమిటీ బాధ్యులు, ముస్లిం నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజానావ, ఖమ్మం:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవ అధ్యక్షులు నిమ్మటరు రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాసరెడ్డికి కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 బడ్జెట్‌లో నిధులు కేటాయించి మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరు లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెపొంగు మల్లేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను అధికారికంగా కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. మెనూ చార్జీలు పెంచడం, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రాకేమున్నేసా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహాదేవ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు జక్కంపూడి వెంకటలక్ష్మి, సీతమ్మ, పూచి రమణ, వెంకటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జీవిత బీమా చేయించుకోవాలి




**ప్రజానావ, సత్తుపల్లి:** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరికీ జీవిత బీమా అవసరమని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సతీష్ అన్నారు. వేంసూర్ మండలంలోని లింగపాలెం గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరచారి గత సంవత్సరం మే నెలలో ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ కింద ఒక సంవత్సరం ప్రీమియంగా రూ.27వేలు 000 చెల్లించినట్లు తెలిపారు. దీంతో ఆయన భార్య నామిని రాంపల్లి విజయకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.9లక్షల 10వేల బీమా మొత్తంతో పాటు రూ.6లక్షల 75 వేల విలువగల పెన్షన్ పథకం కింద స్థానిక ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ చేతుల మీదుగా చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ శ్రీనివాస్, వెంకటేష్, ఏజెంట్ సతీష్ భరణిపాడు, కాంగ్రెస్ నాయకులు కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల బలోపేతానికి కృషి



**ప్రజానావ, నర్సాపూర్:** అంగన్వాడీలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసీడీఎస్ డైరెక్టర్ శృతి ఓజా అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్, బాలసదనం, సఖీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, వంద శాతం ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో సఖీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. డీవీ కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలసదనం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి 99 రోజుల్లో పూర్తి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు. సంరక్షణతో పాటు పోషకాహారం అందించి పిల్లల బలాన్ని పెంచాలని, పోషకాహార సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ మౌలిక సదుపాయాలను పర్యవేక్షించారు. జిల్లాలోని సంక్షేమ శాఖ పనితీరు ఆదర్శంగా ఉందని, అంగన్వాడి సెంటర్స్, సఖీ సెంటర్లలో మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ హేమ భార్గవి, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



**ప్రజానావ, గుడిహత్నూర్:** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని గ్రామ సర్పంచ్ ఆడే శీల అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా సోమవారం గ్రామంలోని మురికి కాలువలు, కలుపు మొక్కలను పరిశు భ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తాచెదారాన్ని ఎక్కడబడితే అక్కడ పడేయవద్దని గ్రామస్తులకు సూచించారు. పరిశుభ్రత ద్వారా రోగాలను కొంత వరకు కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ తెలంగే రాజు, గ్రామపంచాయతీ సెక్రటరీ రాందాస్, గ్రామ నాయకులు ఆడే క్రాంతి, మంగ్నలే బాలు అప్పా, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలపై కోపంతో రూ.44 కోట్ల నిధులను ప్రభుత్వం రద్దు చేసింది

- ప్రజల చైతన్యాన్ని తక్కువ చేయడం వల్లే సిరిసిల్లలో ప్రజలు గుణపాఠం చెప్పారు.
- సుభాష్ నగర్ కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవంలో కేటీఆర్



**ప్రజానావ,సిరిసిల్ల :** గత తమ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.44 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అందుకే ప్రజల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయడం, ముఖ చిత్రం చెరిపివేయాలన్న ప్రయత్నంతోనే ప్రజలు సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో తమకు భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మున్సిపల్ నూతన పాలకవర్గం ఏర్పాటు అయ్యాక తొలి కార్యక్రమంలో స్థానిక సుభాష్ నగర్ ఐదవ వార్డులో రూ.85 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై కమ్యూనిటీ హాలుకు ప్రారంభోత్సవం చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనపై, ప్రజలపై ఉన్న కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేసిన రూ. 44 కోట్ల నిధులను రద్దు చేసిందన్నారు. ప్రజల మనసు గెలవాలనుకుంటే రెండింతల నిధులు మంజూరు చేసి చూపాలన్నారు. ప్రజల చైతన్యాన్ని తక్కువ చేయడం వల్లే మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి చేదు అనుభవం మిగిల్చిందన్నారు. గతంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మళ్ళీ మనకు అవకాశం ఇచ్చారన్నారు. ప్రజల అభిమానాన్ని నమ్మకాన్ని తక్కువ చేయకుండా ప్రతి వార్డుకు స్థానిక కౌన్సిలర్ బాధ్యత తీసుకోవాలని, అభివృద్ధి పనులు సమస్యలు స్థానిక కౌన్సిలర్ కే తెలుస్తాయని, కనుక వారి మాటకే గౌరవం ఇవ్వాలని, వార్డులో వారికే పెద్ద పీట వేయాలని, అదే కౌన్సిలర్ మాట చెల్లుబాటు కావాలని మున్సిపల్ చైర్మన్ కు సూచించారు. పట్టణంలోని 39 వార్డులలో 27 వార్డులు గెలిపించుకున్నామని, ఎలాంటి పొరపచ్చాలు లేకుండా పనులు చేయాలన్నారు. కమ్యూనిటీ భవనాలను ప్రతి 15 రోజులకు ఒకసారి అయినా వచ్చి పర్యవేక్షించాలని అన్నారు. ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూడాలని కేటీఆర్ నూతన పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, స్థానిక ఐదవ వార్డ్ కౌన్సిలర్ దారుణం అరుణ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లపై ప్రభుత్వ వేధింపులు ఆపండి

### 4 వాయిదాలలో బాకీ తీర్చేందుకు అవకాశమివ్వండి

### డిఫాల్ట్ మిల్లర్ల ఆత్మహత్యలను నిరోధించండి

### జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆవేదన



**ప్రజానావ, కరీంనగర్:** రైస్ మిల్లర్లు తీవ్ర నష్టాల్లో ఉన్నందున తమను వేధించవద్దని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 25% జరిమానాతో పాటు 12% వడ్డీ విధిస్తూ వేధించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కరీంనగర్ లోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) విషయంలో ఆరోపణలు నిరాధారమని, తాము నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వానికి వారధిగా ఉండే రైసు మిల్లు వ్యవస్థ ప్రభుత్వంలో భాగస్వామిగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడిచే రైస్ మిల్ ఇండస్ట్రీ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల ఊబిలో నడుస్తోందని వాపోయారు. రాష్ట్రంలో ఇప్పటికే 1/3 రైస్ మిల్లులు డిఫాల్టర్లుగా ఉన్నారని, అందులో భాగంగా ఈ నెల 6న జిల్లాలో ఒక డిఫాల్ట్ మిల్లు సోదరి తణుకు స్వప్న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే దిశలో మిగతా డిఫాల్ట్ మిల్లర్ల దుస్థితి ఉందన్నారు. మిగిలిన నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయన్నారు. అధిక విద్యుత్ చార్జీలు, ధాన్యం ఇచ్చినంత త్వరగా బియ్యం తీసుకోకపోవడం, ధాన్యం తరుగు ఆపడం, డ్యామేజ్ అవ్వడం, ధాన్యంలో నాణ్యత లేక అధిక నూకలు కావడం వంటి అనేక కారణాల వల్ల రైస్ మిల్ ఇండస్ట్రీ నష్టాల బాటలో నడుస్తోందన్నారు. కొంతమంది మిల్లర్ల అశ్రద్ధ, అవగాహన లేకపోవడంతో నష్టాలపాలై డిఫాల్టర్లుగా మిగులుతున్నారని పేర్కొన్నారు. మిల్లర్లపై వస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం, నిరాధారమని, తెలిపారు. తాము సక్రమంగానే పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించాలని మరియు కస్టమ్ మిల్లింగ్ రైస్ తరలింపులో సహకరించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాము ధాన్యం సేకరిస్తున్నామని స్పష్టం చేశారు . రైస్ మిల్లింగ్ పరిశ్రమ నష్టాల్లో ఉన్నందున, జరిమానాలు, వడ్డీ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. ఇప్పటివరకు మిల్లర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన మిల్లింగ్, ట్రాన్స్ పోర్ట్, డ్రై ఏజ్, కస్టూడియన్ చార్జీలు గత కొన్నేళ్లుగా పెండింగ్ లోనే ఉన్నాయని వాపోయారు. డిఫాల్ట్ మిల్లర్లకు ఫెనాల్టీని, 12 శాతం వడ్డీని మాఫీ చేపించి ప్రభుత్వానికి బాకీ న్న బియ్యం నాలుగు వాయిదాలలో ఇచ్చి బాకీ తీర్చుటకు అనుమతి ఇప్పించాలని కోరారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి నర్సింగరావు, జిల్లా కార్యదర్శిలు టి. కరుణాకర్, జి.రాజమౌళి, కోశాధికారి జి.ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఫిలింనగర్‌లో శుభ్రత పాదయాత్ర

### కరెంట్ ఆఫీస్ నుంచి బీజేఆర్ బస్తి వరకు పాదయాత్ర

### చెత్త వాహనాలు సమయానికి రావాలని స్థానికుల అభ్యర్థన

**ప్రజానావ, ఖైరతాబాద్:** జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ ప్రాంతంలో సోమవారం ఖైరతాబాద్ జోనల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్ ఆధ్వర్యంలో శుభ్రత పాదయాత్ర నిర్వహించారు. ఫిలింనగర్ కరెంట్ ఆఫీస్ దగ్గర నుంచి బీజేఆర్ బస్తీ వరకు పాదయాత్ర చేస్తూ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం బీజేఆర్ నగర్ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆగి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాటూరి రమేశ్ మాట్లాడుతూ ఇలాంటి శుభ్రత కార్యక్రమాలను ప్రతివారం నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్‌ను కోరారు. బస్తీల్లో చెత్త సేకరణకు వచ్చే వాహనాలు సరైన సమయానికి రాకపోవడంతో కొంతమంది నివాసితులు చెత్తను రోడ్లపై పడేయాల్సి వస్తోందని తెలిపారు. ఉదయం వేళలోనే చెత్త సేకరణ వాహనాలు రావాలని డిప్యూటీ కమిషనర్‌ను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఎన్. శంకర్ వెంటనే ఉన్నత అధికారులకు ఫోన్ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.






## పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి

**ప్రజానావ, మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయా లలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల ని ఆదేశించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 99రోజుల పాటు ఈ కార్యాచరణ అమ లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. ప్రభు త్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణా ళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తిచేయాలని సూచిం చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సం ఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# చదువుతోనే మంచి భవిష్యత్తు

**సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య**

**ప్రజానావ, హత్నూర:** చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, తప్పుడు మార్గంలో వెళితే చట్టంలో అనేక శిక్షలు ఉన్నాయని న్యాయ వ్యవస్థలో అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు. తప్పు చేసిన వారు ఏదోరకంగా శిక్షించబడతారని అన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడవద్దని, ఎంతోమంది ర్యాగింగ్ కు పాల్పడి కటకటాల పాలవుతున్నారని తెలిపారు. బాల్య వివాహాలు చేసుకోవద్దని, నిర్ణీత వయసు దాటాకే పెళ్లి చేసుకోవాలని సూచించారు. అమ్మాయిలను వేధించినా, ప్రేమ పేరుతో మోసం చేసినా చట్టపరమైన చర్యలకు గురవుతారన్నారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, కేవలం పుస్తకాలపైనే దృష్టి సారించి చదువులో రాణించాలని, సామాజిక మాధ్యమాలను మంచి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ముందంజలో ఉంటున్నారని,



అబ్బాయిలు చెడు వ్యసనాలకు అలవాటుపడుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో హత్నూర గ్రామ సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఎస్సై శ్రీధర్ రెడ్డి, వైద్యురాలు రజిని, చెక్క రవీందర్ గౌడ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇచ్చోడ ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

**ప్రజానావ, నేరడిగొండ (ఇచ్చోడ):** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని దరఖాస్తుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను విన్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. ప్రజావాణి అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించి, భూ రికార్డుల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తహశీల్దార్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను భద్రపర్చాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామారావు, ఇచ్చోడ తహశీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ ఎం.రవీందర్, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

**సుమారు 34 మంది విద్యార్థులకు అస్వస్థత**

**ప్రజానావ, మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో భోజనం చేసిన అనంతరం సుమారు 34 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ఆదివారం కావడంతో విద్యార్థులకు మటన్‌తో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. భోజనం చేసిన కొంతసేపటికే కొందరు విద్యార్థులకు వాంతులు, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపించడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులను మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన విద్యార్థులను కూడా వైద్యులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన మటన్ భోజనం వల్లే ఫుడ్ పాయిజన్ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టల్‌లో అందించే ఆహార



నాణ్యతను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ విషయంపై ఇంకా అధికారికంగా స్పష్టత రాలేదు. ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఖమ్మంలో కవిత అరెస్ట్

**జెడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్తత**

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను పరామర్శించేందుకు వచ్చిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మంలోని జెడ్పీ సెంటర్ వద్ద నిరసన చేపట్టిన ఆమెను ఖమ్మం 3 టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశరధన్ మహారాజ్, జాగృతి కార్యకర్తలను కూడా అరెస్ట్ చేశారు. అంతకుముందు వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కవిత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. వెలుగుమట్ల బాధితుల ఆవేదన చూస్తే కడుపు తరుక్కుపోతోందని, ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు ఈ ఆడబిడ్డల ఉసురు తగులుతుందని అన్నారు. పరీక్షల సమయంలో పుస్తకాలతో సహా ఇళ్లను కూల్చేశారని, బాధితుల ఆవేదన, బాధ కొన్ని రాజకీయ పార్టీలకు ఎగ్జిబిషన్ గా మారిందని విమర్శించారు. ఇళ్లను కూల్చివేయడం ద్వారా మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తేనే ఇంటికి మంచిది కాదని.. అలాంటిది ఇంత మంది ఆడబిడ్డల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని అన్నారు. పిల్లల పరీక్ష సమయంలో తల్లితండ్రులు ఎంతో ఆందోళనతో ఉంటారని, కానీ పుస్తకాలతో సహా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చేశారని వాపోయారు. ముఖ్యమంత్రి, జిల్లాలో ఉన్న మంత్రులు ఈ సమస్యపై స్పందించి బాధితులకు న్యాయం



చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల ఇళ్లు కూల్చిన చోటే కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనతో జెడ్పీ సెంటర్ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధితులతో పాటు ఇక్కడ విశారదన్ మహారాజ్ కూడా ఉన్నారని, ఆయన పట్టుపడితే వదలరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ, ప్రజా సంఘాలతో పాటు జాగృతి కూడా మీకు తోడుగా ఉందని, పరిష్కారమయేయ వరకు పోరాటం చేద్దామని స్పష్టం చేశారు.

# సమస్యలు పరిష్కరించాలి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చక్రపాణి**

**ప్రజానావ, తాండూర్:** కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు దశల పోరాటంలో భాగంగా సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాండూర్ కేజీబీవీలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 9న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించక పోతే ఈనెల 20న 'చలో అసెంబ్లీ'కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, తాండూర్ మండల అధ్యక్షులు దేవదాస్, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, మండల వనరుల కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజానావ, మావల:** మావల మండలం వాగపూర్ గ్రామానికి చెందిన గడ్డం జీవన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



**ప్రజానావ, ఆదిలాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా శాఖల వారీగా సమీక్షించి, నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 71 అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఏఓ వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**



**ప్రజానావ, సత్తుపల్లి:** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సత్తుపల్లిలోని ఆర్యవైశ్య కిరాణా మర్చంట్ ఫంక్షన్ హాల్‌లో వాసవి క్లబ్ సత్తుపల్లి గ్రేటర్, ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి బలమైన పునాదులని కొనియాడారు. తల్లిగా, సోదరిగా, భార్యగా కుటుంబ బాధ్యతలను ఎంతో సహనం, ధైర్యం, ఓర్పుతో నిర్వహిస్తారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, డాక్టర్ రాగిణి, కౌన్సిలర్ కొత్తూరు తులసి ఉమామహేశ్వర రావు, గుండు రేణుక, వాసవి క్లబ్ మరియు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించాలి



**ప్రజానావ, గుడిహత్నూర్:** ఆసక్తి ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉర్వేత రోహిదాస్ అన్నారు. గత నెలలో గుడిహత్నూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలకు రూ.20వేల నగదు సహాయం అందజేసినట్లు తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామాల్లో కూడా క్రీడాకారులకు తనవంతుగా బహుమతులు, నగదు సహాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు కృషి, పట్టుదలతో సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# భార్యకు సంజు ఎమోషనల్ మెసేజ్..

## వరల్డ్ కప్ హీరో మనసులో మాట ఇదే!

**ముంబై:** 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు చారిత్రాత్మక విజయం సాధించిన వేళ, టీమిండియా స్టార్ బ్యాటర్ సంజు శామ్సన్ తన అద్భుత ప్రదర్శనతో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు సంజు. న్యూజిలాండ్‌తో జరిగిన ఏకపక్ష ఫైనల్లో భారత్ ఘనవిజయం సాధించడంలో సంజు శామ్సన్ కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నీలో మొత్తం 321 పరుగులు చేసి భారత్ తరపున టాప్ స్కోరర్‌గా నిలిచిన సంజు, తన కెరీర్ లోనే అత్యుత్తమ ఫామ్ ను ప్రదర్శించారు. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత సంజు తన భార్యతో దిగిన ఫోటోను షేర్ చేస్తూ ఒక ఎమోషనల్ నోట్ రాశారు. ఈ నోట్‌లో వరల్డ్ కప్ హీరో సంజు మనసులో మాట ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత సంజు తన సక్సెస్ వెనుక ఉన్న అసలు శక్తి తన భార్య చారులత అని పేర్కొంటూ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. "మనం కలిసిన రోజు నుంచి నేటి వరకు.. నా ప్రతి అడుగులో నాకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు. బయటి ప్రపంచం నన్ను ఎలా చూసినా, నాలోని మంచిని, చెడును చూసి కూడా నా పక్కనే బలంగా నిలబడ్డావు. నా జీవితంలో క్రికెట్ ప్రాముఖ్యతను గుర్తించి, దానికి తగిన గౌరవం ఇచ్చినందుకు థాంక్స్. ఈ అద్భుత క్షణం కోసం నేను ఎంతగా ఎదురుచూశానో, నువ్వు కూడా అంతే ఆరాటపడ్డావు. థాంక్యూ డియర్" అంటూ రాసుకొచ్చారు. ఇదే సమయంలో వరల్డ్ కప్ హీరోగా కేరళకు తిరిగి రానున్న సంజు శామ్సన్‌కు ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ క్రీడా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి స్పందిస్తూ, సంజును రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా సత్కరిస్తామని ప్రకటించారు. త్వరలోనే ఈ సన్మాన కార్యక్రమ వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

# పీసీబీ పరువు తీసిన షోయబ్ అక్తర్!

## భారత క్రికెట్ వ్యవస్థకు సలాం అంటూ షాకింగ్ కామెంట్స్





**ఇస్లామాబాద్:** 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు అద్భుత విజయంపై పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్ ప్రశంసల వర్షం కురిపించాడు. టీమిండియా అద్భుత ప్రదర్శనను కొనియాడుతూనే, తన సొంత దేశపు క్రికెట్ బోర్డు పరువు తీశాడు. భారత యువ జట్టు ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంపై షోయబ్ అక్తర్ స్పందిస్తూ, ఇది కేవలం ఆటగాళ్ల విజయం మాత్రమే కాదని, భారత క్రికెట్ వ్యవస్థ సాధించిన విజయమని అభివర్ణించారు. మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడంలో బీసీసీఐ అనుసరిస్తున్న విధానమే భారత్‌ను విశ్వవిజేతగా నిలిపిందని కొనియాడాడు.

### సంజు శామ్సన్ ప్రదర్శనపై ప్రశంసలు

ముఖ్యంగా ఈ టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజు శామ్సన్‌ను అక్తర్ ప్రత్యేకంగా అభినందించారు. "అవకాశం ఆలస్యంగా వచ్చినా, కేవలం 4-5 మ్యాచ్‌ల్లోనే అద్భుత ప్రదర్శన చేసి టోర్నీలోనే అత్యుత్తమ ఆటగాడిగా నిలవడం సామాన్యం కాదు. సంజు ఈ అవార్డుకు 100 శాతం అర్హుడు" అని కొనియాడాడు. ఇషాన్ కిషన్ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడని, ఫైనల్‌లో అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ జట్టును గెలిపించిందని అక్తర్ ప్రశంసించాడు. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలే ఈ విజయానికి పునాది అని అక్తర్ విశ్లేషించాడు. "సీనియర్లను పక్కన పెట్టి యువ ఆటగాళ్లపై నమ్మకం ఉంచడం ఒక సాహసం. ఆ నమ్మకాన్ని గంభీర్ అండ్ కో నిలబెట్టుకుంది. టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలే భారత్‌కు ట్రోఫీని అందించాయి" అని అన్నాడు.

### పీసీబీకి చురకలు


ఇదే క్రమంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుపై అక్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. "సరైన ప్రతిభను గుర్తించడంలో, యువతకు అవకాశాలివ్వడంలో బీసీసీఐని చూసి పీసీబీ చాలా నేర్చుకోవాలి. మెరిట్ పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో పాకిస్థాన్ క్రికెట్‌ను చూస్తే అర్థమవుతుంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

# ఇషాన్ కిషన్ గర్ల్ ఫ్రెండ్ ఎవరో తెలుసా!

## ఇంత ఏజ్ గ్యాపా?



**అహ్మదాబాద్:** టీమిండియా స్టార్ క్రికెటర్ ఇషాన్ కిషన్ వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా ఇటీవల జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌ఫైనల్ సందర్భంగా అతని గర్ల్‌ఫ్రెండ్ అదితి హుండియా అందరి దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ సమయంలో స్టాండ్స్‌లో నుంచి ఇషాన్‌కు ఆమె ఉత్సాహంగా మద్దతు ఇస్తూ కనిపించింది. ఇక, భారత్ విజయం అనంతరం ఇషాన్ కిషన్ తన లేడీ లవ్‌కు ముద్దు పెట్టుకోవడం కూడా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో సోషల్ మీడియాలో అదితి హుండియా గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఇషాన్ కిషన్ మనసు దోచిని అదితి హుండియా ఎవరు? ఆమె నేపథ్యం ఏంటి? అనే చర్చ సాగుతుండగా.. ఆమెది జైపూర్.. ఆమె వృత్తిరీత్యా మోడల్ మరియు ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్. ఆమె తండ్రి జైపూర్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన వ్యక్తి. ఫ్యాషన్ ప్రపంచంలో అదితి తన అందం, స్టైల్ మరియు ఆకర్షణీయమైన చిరునవ్వుతో మంచి గుర్తింపు సంపాదించింది. అదితి 2018లో జరిగిన మిస్ దివా 2018 పోటీలో విజేతగా నిలిచింది. అంతకుముందు ఫెమినా మిస్ ఇండియా పోటీలో ఫైనలిస్ట్‌గా కూడా నిలిచింది. ఆ తరువాత ఆమె ఫ్యాషన్ రంగంలో అడుగుపెట్టి అనేక మోడలింగ్ ప్రాజెక్టుల్లో పాల్గొంది. అంతేకాదండోయ్.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు. ప్రస్తుతం ఆమెకు సుమారు 3.7 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మాత్రమే కాకుండా కంటెంట్ క్రియేటర్‌గా కూడా ఆమె మంచి గుర్తింపు పొందింది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే అదితి ఒక వ్యాపారవేత్త కూడా. ఆమెకు స్వంతంగా ఒక ఫ్యాషన్ లేబుల్ ఉంది. అదితి సెంట్‌స్కావీయర్స్‌కాలేజీ నుంచి బీబీఏ డిగ్రీ పూర్తి చేసింది. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్, ఫ్యాషన్ షోలలో పాల్గొంటూ కెరీర్‌ను ప్రారంభించింది. అదితి ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ నటించిన "టూటే ఖాబ్" మ్యూజిక్ వీడియోలో కూడా కనిపించింది. 2019 ఐపీఎల్ సమయంలో ఇషాన్ కిషన్‌తో లింక్ పెడుతూ వార్తల్లో లిచింది అదితి హుండియా.. అప్పటి నుంచే వీరి ప్రేమకథ ప్రారంభమైనట్లు ప్రచారం జరిగింది. మీడియా కథనాల ప్రకారం, అదితి హుండియా ఇషాన్ కిషన్ కంటే ఏజ్‌లో కాస్త పెద్దది. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 సంవత్సరాలు కాగా, అదితి వయసు 29 సంవత్సరాలు. వీరి జంటను అభిమానులు సోషల్ మీడియాలో " మేడ్‌ఫర్‌ఈచ్‌అదర్" అంటూ ప్రశంసిస్తున్నారు. మరి వీరి మధ్య లవ్ ఉందా.. అది పెళ్లి పీటల వరకు వెళ్తుందా అనేది మాత్రం వేచి చూడాలేమో..



# టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత గ్యారీ కిర్‌స్టన్‌కు కొత్త బాధ్యతలు




**కొలంబో:** టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌పై గ్రాండ్ విక్టరీ కొట్టి.. వరుసగా మూడో సారి వరల్డ్ కప్‌ను ముద్దాడింది భారత జట్టు.. అయితే, ఈ పరిణామం జరిగిన మరుసటి రోజు అంటే.. ఈ రోజు దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్.. టీమిండియా మాజీ హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్‌కు కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు.. గ్యారీ కిర్‌స్టన్‌కు రో కీలక బాధ్యత దక్కింది. శ్రీలంక క్రికెట్ సోమవారం ఆయనను శ్రీలంక జాతీయ పురుషుల క్రికెట్ జట్టుకు కొత్త ప్రధాన కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 15 నుండి అమలులోకి రానుంది. దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ క్రికెటర్ అయిన గ్యారీ కిర్‌స్టన్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో విశేష గుర్తింపు పొందాడు. 2008 నుంచి 2011 వరకు ఆయన ఇండియా నేషనల్‌క్రికెట్‌టీంకుప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో భారత జట్టు 2011 ఐసీసీ క్రికెట్‌వరల్డ్‌కప్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత 2011 నుంచి 2013 వరకు సౌత్ ఆఫ్రికా నేషనల్‌క్రికెట్‌టీంకు కూడా ప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఆయన మార్గదర్శకత్వంలో దక్షిణాఫ్రికా జట్టు 2013లో క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో ప్రపంచ నంబర్-1 జట్టుగా నిలిచింది. శ్రీలంక క్రికెట్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, కొత్త ప్రధాన కోచ్ నియామకం జాతీయ హై పెర్ఫార్మెన్స్ వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగమని తెలిపింది. ఇటీవల గ్యారీ కిర్‌స్టన్ నమిబియా నేషనల్‌క్రికెట్ టీంతో కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఐసీసీ మెన్స్‌టీ20 వరల్డ్‌కప్2026 సందర్భంగా నమీబియా జట్టుకు మార్గనిర్దేశం చేశారు. క్రీడాకారుడిగా 1993 నుంచి 2004 వరకు కొనసాగిన తన కెరీర్‌లో కిర్‌స్టన్ టెస్ట్ మరియు వన్డే క్రికెట్‌లో కలిపి 14,087 పరుగులు సాధించారు. ఇందులో 21 టెస్ట్ సెంచరీలు మరియు 13 వన్డే సెంచరీలు ఉన్నాయి. ఇక, శ్రీలంక క్రికెట్‌లో ఆయన నియామకం రెండేళ్ల పదవీకాలం ఉండనుంది. ఇది ఏప్రిల్ 14, 2028 వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో ఆయన ప్రధాన బాధ్యతల్లో ఒకటి ఐసీసీ మెన్స్‌క్రికెట్‌వరల్డ్‌కప్2027కు శ్రీలంక జట్టును సిద్ధం చేయడం. ఈ టోర్నమెంట్ సౌత్‌ఆఫ్రికా, నమిబియా, జింబాబ్వేలో జరగనుంది. కాగా, టీ20 వరల్డ్ కప్‌లో శ్రీలంక పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయిన విషయం విదితమే..

# స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్.. లక్ష్య సేన్ డౌటే..!



**హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది. రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్ సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండడని ఆమె తెలిపింది. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.



## త్రిషకు పార్తీబన్ క్షమాపణలు

ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదఅని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.

## సూపర్ మ్యాన్ తరహా స్టోరీతో అల్లు అర్జున్



అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ – మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్టైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.



## సల్మాన్‌కు జోడీగా నయనతార

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల కానుంది.

## చిన్న పిల్లలపై అత్యాచారాలు అరికట్టాల్సిందే

### సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు. నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ సినిమాతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ట్రోల్స్ పెద్ద పదం

### ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా



విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

Published and Editor Owned by **Adula Thirupathi,** and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. **Phone No: 99484 33277.**